ఈ నెల 22 నుంచి జిల్లా స్థాయి యువజనోత్సవాలు

నిజామాబాద్ స్పోర్ట్స్, డిసెంబర్ 15 : జిల్లా యువజన, క్రీడల శాఖ కార్యాలయం (స్టెప్)- నిజామాబాద్ వారి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యువజనోత్సవాలను ఈనెల 22వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి ముత్తెన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకేంద్రంలోని న్యూ అంబేద్కర్ భవన్, తిలక్‌గార్డెన్‌లో ఉదయం 9 గంటల నుంచి ఉత్సవాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఉత్సవాలు, పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఈనెల 20వ తేదీలోగా dysonizamabad@gmail.com ద్వారా లేదా 9701177144, 9959649574 నంబర్లకు వాట్సాప్ చేసి పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. పోటీల్లో పాల్గొనే రోజు 2 కలర్ ఫొటోలు, ఆధార్‌కార్డ్ లేదా బర్త్ సర్టిఫికెట్ కాపీని వెంట తీసుకురావాలని సూచించారు. మరిన్ని వివరాలకు సుభాష్‌నగర్‌లోని యువజన, క్రీడల కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

ఖలీల్‌వాడి, డిసెంబర్ 15 : వారం రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందిన గుర్తు తెలియని ఓ అనాథ శవానికి ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. 4వ పోలీస్‌స్టేషన్ సిబ్బంది ఆధ్వర్యంలో నగరంలోని దేవీ టాకీస్ చౌరస్తా వద్ద ఉన్న సార్వజనిక్ శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించినట్లు సంస్థ అధ్యక్షుడు డాక్టర్ మద్దుకూరి సాయిబాబు తెలిపారు. కార్యక్రమంలో ఇందూరు యువత సభ్యులు సాయితేజ, చంద జగన్‌మోహన్, జయదేవ్, పురుషోత్తం, పోలీసు సిబ్బంది నాగేంద్ర పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

ధర్పల్లి, డిసెంబర్ 15 : మండలంలోని దుబ్బాకకు చెందిన చంద్రపల్లి రుచిత అనే యువతి అదృశ్యమైంది. ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం ఉదయం 11 గంటలకు ఇంట్లో వాళ్లు పని నిమిత్తం కమ్మర్‌పల్లి మండలం కోనాసముందర్‌కు వెళ్లగా.. రుచిత ఇంటి వద్దే ఉన్నది. తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చే సరికి రుచిత కనబడలేదు. జాబ్ కోసం ఎక్కడికైనా వెళ్లి ఉండవచ్చని భావించామని కుటుంబీకులు తెలిపారు. శుక్రవారం వరకు ఆచూకీ లభించకపోవడంతో యువతి తండ్రి మహిపాల్ ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

'బేటీ బచావో – బేటీ పడావో'పై అవగాహన

అవగాహన కల్పిస్తున్న అధికారులు

జక్రాన్‌పల్లి, డిసెంబర్ 15 : మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బేటీ బచావో – బేటీ పడావో పథకంపై మహిళా, శిశు దివ్యాంగులు, వయోవృద్ధులకు జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి రసూల్‌బీ హాజరై మాట్లాడారు. ఆడపిల్లలను మగపిల్లలతో సమానంగా చదివించాలని అన్నారు. ఆడపిల్లల విద్యా ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఆర్మూర్ ప్రాజెక్టు సీడీపీవో భార్గవి, ఏసీడీపీవో జ్యోతి, రాంబాబు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాణి, హెల్త్ సూపర్‌వైజర్ అంగన్‌వాడీ టీచర్లు, ఆశలు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

రుద్రూర్, డిసెంబర్ 15 : మండలంలోని సులేమాన్‌నగర్‌లో వైద్యసిబ్బంది శుక్రవారం ఇంటింటికీ తిరిగి పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. మురికి కాలువల వద్ద, డ్రైనేజీల వద్ద మురికి పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అంటువ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం అనంతలక్ష్మి, ఆశవర్కర్లు ఫర్జానా, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పోస్టల్ ఉద్యోగుల సమ్మె

ధర్పల్లి, డిసెంబర్ 15 : తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పోస్టల్ ఉద్యోగులు చేపట్టిన సమ్మె కొనసాగుతున్నది. ధర్పల్లి మండల కేంద్రంలోని పోస్టల్ కార్యాలయం ఎదుట పోస్టల్ ఉద్యోగులు చేపట్టిన నిరసన శుక్రవారం మూడో రోజుకు చేరుకున్నది. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ.. తమ డిమాండ్లను పరిష్కరించాలని అన్నారు. డిమాండ్లు పరిష్కరించేంత వరకు నిరసనలు చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో లింగం, ఉమేందర్, అశోక్, సంతోష్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు తూంపల్లి విద్యార్థుల ఎంపిక

ఉపాధ్యాయులతో రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైన తూంపల్లి పాఠశాల విద్యార్థులు

ఉపాధ్యాయులతో రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైన సిరికొండ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు

సిరికొండ, డిసెంబర్ 15 : ఆర్మూర్‌లో ఇటీవల నిర్వహించిన హాకీ పోటీల్లో తూంపల్లి పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పీఈటీ నాగేశ్ తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ –నిజామాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్–17 హాకీ పోటీల్లో పాఠశాలకు చెందిన లోకేశ్, రాహుల్, అఖిల్, విశాల్, రాజు, నవీన్, జస్వంత్, అక్షయ, శ్రీజ, హారిక, అఖిల, కీర్తన, శివాణి, ప్రణతి, రితిస్, శ్రీనిధి ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు రాములు, ఉపాధ్యాయులు, సర్పంచ్ బాలమణి, మల్లేశ్, ఎంపీటీసీ లింగం, ఎస్ఎంసీ చైర్‌పర్సన్ లావణ్య, సభ్యులు శుక్రవారం అభినందించారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు ఆశ్రమ పాఠశాల విద్యార్థులు

ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు హైదరాబాద్‌లో జరిగిన జోనల్ స్థాయి క్రీడల్లో సిరికొండ మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయిని కల్పన తెలిపారు. అండర్–17 వాలీబాల్‌లో ప్రశాంత్, అండర్–14 వాలీబాల్‌లో రాహుల్, దినేశ్, కబడ్డీలో చిన్నా ప్రతిభ కనబర్చినట్లు వివరించారు. ఎంపికైన విద్యార్థులు వచ్చేనెల 4, 5, 6వ తేదీల్లో భద్రాచలంలో నిర్వహించే రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను హెచ్ఎం, ఉపాధ్యాయులు శుక్రవారం అభినందించారు.

సర్దార్ వల్లాభాయ్‌కి ఘన నివాళి

సర్దార్ వల్లాభాయ్ పటేల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

ఖలీల్‌వాడి, డిసెంబర్ 15 : తొలి ఉప ప్రధాని, ఉక్కుమనిషి సర్దార్ వల్లాభాయ్ పటేల్ వర్ధంతిని జడ్పీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నీలం రెడ్డి, శేఖర్ రాజు, నాయకులు పాల్గొన్నారు.

పటేల్ సంకల్పబలం నేటి సమాజానికి ఆదర్శం కావాలి

సిరికొండ, డిసెంబర్ 15 : దేశసేవ, త్యాగ నిరతికి చిహ్నంగా మహా సమైక్యత నిర్మాతగా ఉక్కుమనిషి సర్దార్ వల్లాభాయ్ పటేల్ సంకల్పబలం నేటి సమాజానికి ఆదర్శం కావాలని సత్యశోధక్ పాఠశాల ప్రిన్సిపాల్ నర్సయ్య అన్నారు. దేశ తొలి ఉపప్రధాని, స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ వల్లాభాయ్ 73వ వర్ధంతిని సత్యశోధక్ పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప మహాపడిపూజ

పడిపూజ నిర్వహిస్తున్న మాలధారులు, భక్తులు

ఇందల్వాయి, డిసెంబర్ 15 : మండలంలోని తిర్మన్‌పల్లిలో శుక్రవారం ఉదయం అయ్యప్ప మహాపడిపూజ కార్యక్రమాన్ని మాలధారుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అల్లడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో అయ్యప్ప, గణపతి, సుబ్రహ్మణ్య విగ్రహాలకు అభిషేకాలు, పూజలు చేశారు. ఈ సందర్భంగా మాలధారులు పాడిన అయ్యప్ప పాటలు ఆకట్టుకున్నాయి. అనంతరం మాలధారులు, భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో శంకర్ గురుస్వామి, సాయిబాబా, కిషన్ గురుస్వామి, గంగారెడ్డి, రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చందామియాబాగ్ తండా ఉపసర్పంచ్ చెక్‌పవర్ రద్దు

జక్రాన్‌పల్లి, డిసెంబర్ 15 : మండలంలోని చందామియాబాగ్ తండా ఉపసర్పంచ్ చెక్‌పవర్ రద్దు అయినట్లు ఎంపీవో యూసుఫ్‌ఖాన్ శుక్రవారం తెలిపారు. మండలంలోని చందామియాబాగ్ తండా గ్రామపంచాయతీలో ఉపాధిహామీ నిధులకు కొన్ని నెలల నుంచి చెక్కుపై ఉపసర్పంచ్ సంతకం చేయకపోవడంతో సర్పంచ్ కిషన్‌నాయక్ ఈ విషయాన్ని ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. ఎంపీడీవో షోకాజ్ నోటీసు ఇచ్చినా స్పందించకపోవడంతో కలెక్టర్ చెక్‌పవర్ రద్దు చేస్తున్నట్లు సర్క్యులర్ జారీ చేసినట్లు తెలిపారు. చెక్‌పవర్‌ను సర్పంచ్, ఎంపీవోకు ఇచ్చినట్లు పేర్కొన్నారు.

ఓటరు నమోదు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి

కోటగిరి, డిసెంబర్ 15 : ఓటరు నమోదు ప్రక్రియను పకడ్బందీగా చేయాలని తహసీల్దార్ ప్రభాకర్ అన్నారు. తహసీల్ కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాల బీఎల్‌వోలతో శుక్రవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. మరణించిన వారి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించాలన్నారు. జనవరి 1, 2024 నాటికి 18 ఏండ్లు నిండిన వారికి ఓటు హక్కు కల్పించాలని సూచించారు.

గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించాలి

సిరికొండలో మాట్లాడుతున్న ఎంపీపీ సంగీతా రాజేందర్

సిరికొండ, డిసెంబర్ 15 : గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించాలని సిరికొండ ఎంపీపీ మలావత్ సంగీతా రాజేందర్ అన్నారు. మండలకేంద్రంలోని ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. వ్యవసాయ శాఖ మండల అధికారి వెంకటేశ్ మాట్లాడుతూ.. రైతులకు ఇబ్బంది లేకుండా ఎరువులను సరిపడా అందుబాటులో ఉంచామని తెలిపారు. విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తామని ఏఈ చంద్రశేఖర్ చెప్పారు. గ్రామాల్లో వైద్య సేవ లందిస్తున్నామని, సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని డాక్టర్ అరవింద్ అన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ తోట రాజన్న, ఎంపీడీవో లక్ష్మీప్రసాద్, తహసీల్దార్ రవీందర్, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

చందూర్‌లో...

మోస్రా (చందూర్), డిసెంబర్ 15 : చందూర్ మండల కేంద్రంలో ఎంపీపీ లావణ్యారాంరెడ్డి అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. పంచాయతీ రాజ్ ఏఈ పవన్ మాట్లాడుతూ.. భవన నిర్మాణాలు తుది దశలో ఉన్నాయని, పనులను త్వరగా పూర్తిచేయాలని సూచించారు. లిఫ్ట్ ఇరిగేషన్ అధికారి జీవన్ మాట్లాడుతూ .. లిఫ్టు పనులు సాగుతున్నాయని చెప్పారు. లక్ష్మాపూర్ సర్పంచ్ సత్యనారాయణ మాట్లాడుతూ.. చెరువులు కబ్జా కాకుండా చర్యలు తీసుకోవాలని లిఫ్ట్ ఇరిగేషన్ అధికారి జీవన్‌ను కోరారు. ఘన్‌పూర్‌లో కొత్తగా నిర్మించిన రోడ్లపై కేజ్‌వీల్ ట్రాక్టర్లను నడుపుతున్నారని తెలుపగా.. కేజ్‌వీల్ ట్రాక్టర్లు నడిపితే తమకు సమాచారం ఇవ్వాలని ఆర్‌అండ్‌బీ అధికారి సూచించారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లపై గుంతలు ఏర్పడ్డాయని, ప్యాచ్ వర్క్ చేయాలని వైస్ ఎంపీపీ దశాగౌడ్ ఆర్‌అండ్‌బీ అధికారిని కోరారు. విద్యుత్‌కు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అధికారులు సూచించారు. ఉద్యానవన అధికారి వహీద్ తోటల పెంపకంపై ప్రభుత్వం అందజేస్తున్న సబ్సిడీని, ఏపీవో సురేశ్ ఉపాధికి సంబంధించిన అంశాలను వివరించారు. తహసీల్దార్ సెలవుపై వెళ్లడంతో ధ్రువపత్రాల కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వైస్ ఎంపీపీ దశాగౌడ్ సభ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ లావణ్యా రాంరెడ్డి, ఎంపీడీవో నీలావతి, ఎంపీవో తారాచంద్, ఎంఈవో శాంతాకుమారి, సర్పంచులు బొడ్డోళ్ల సత్యనారాయణ, దాసరి గంగారాం, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.